www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కల్యాణి

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె నూతన సబ్ కలెక్టర్‌గా నియమితులైన చల్లా కళ్యాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిని అభినందించి, మదనపల్లె డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మదనపల్లెలోని తన కార్యాలయంలో సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కల్యాణి

జడ్‌పిటిసి ఉప ఎన్నిక పోరుకు

సర్వ సన్నద్ధం

నేడే పోలింగ్

25 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

1,350 మందితో పోలీసు బందోబస్తు

పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు

పులివెందులలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ నిబంధనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కడప జిల్లాలోని పులివెందుల, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం ఉప ఎన్నికలను నిర్వహించనుంది. ఒంటిమిట్ట, పులివెందుల స్థానాల పరిధిలోని 45 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులను నియమించింది. జిల్లా ఎన్నికల అధికారులు రూట్ ఆఫీసర్లు, పిఒలు, ఎపిఒలు, మైక్రోఅబ్జర్వర్లు, పోలీస్ అధికారులతో కలిసి పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను మూడు జిపిఎస్ సదుపాయాలతో కూడిన బస్సుల్లో తీసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. వెబ్‌కాస్టింగ్, సిసి కెమెరాల నిఘా పర్యవేక్షణలో ఉపఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంది. జడ్‌పిటిసి ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. 1,350 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తోంది. ఒంటిమిట్టలో 15, పులివెందులలో 10 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి సిఐ స్థాయి పోలీస్ అధికారితో కూడిన సుమారు 30 నుంచి 40 మంది పోలీసులను మోహరించింది. ఒంటిమిట్ట పరిధిలోని సోమశిల వెనుకజలాల పరిధిలోని గ్రామాల్లో స్మగ్లర్ల ఆగడాలు నెలకొన్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్టలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఎంసి చైర్‌పర్సన్ వరలక్ష్మిని సన్మానించిన మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎంసి చైర్‌పర్సన్ వరలక్ష్మి, కమిటీ సభ్యులు రైతాంగం కోసం కష్టపడి పని చేయాలన్నారు. రూపానందరెడ్డి సూచన మేరకు ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు అధికంగా పండిస్తున్న రైతుల కోసం ఒక కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో 113 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారికి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున అందజేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో 24 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పవన్ కల్యాణ్ వద్ద నుండి రూ.లక్ష పరిహారం తీసుకునేందుకు వెళ్లకూడదని రైతు కుటుంబాలను బెదిరించిన దుర్మార్గమైన మనస్తత్వం గత వైసిపి ప్రభుత్వానిదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్రంలోనీ రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారించి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. బొప్పాయి రైతులకు కూడా గిట్టుబాటు ధర లభించేందుకు ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. కష్టపడి పంట పండించే రైతు కంటతడి పెట్టకూడదన్నారు. సంక్షేమం పెన్షన్ల కోసమే నెలకు రూ.2,500 కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు పెట్టే ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రాజంపేట అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన సమయంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు నెల రోజుల్లో ఇల్లు కట్టిస్తానన్న జగన్ ఏమి చేశారని ప్రశ్నించారు. ఐదేళ్లలో జరిగిన విధ్వంసం నుండి కోలుకోవాలని మరో 15 ఏళ్లు మనం అధికారంలో ఉండాలని అందుకు కూటమి పార్టీలలోని నాయకులు చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి ఐక్యమత్యంతో ప్రజలు కోసం పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కడప జిల్లా జనసేన అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, పిసిఎన్ బ్రదర్స్ చంద్రశేఖర్, వెంకటేష్, మైసూరువారిపల్లి సర్పంచ్ సంయుక్త, బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కమతం నాగరాజు, రవికుమార్‌రాజు, వెంకటేశ్వరరాజు, గునిపాటి చెన్నారాయుడు, సూరపరాజు సుబ్బరాజు, బడుగుంటపల్లె సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు .ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

- **100 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన**
- **భారీగా పాల్గొన్న విద్యార్థులు, అధికారులు**

తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం సోమవారం రాయచోటిలో విద్యాశాఖ, జిల్లా పర్యాటక శాఖ, ప్రభుత్వ వివిధ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పట్టణంలోని చిత్తూరు రోడ్డు వద్ద ఉన్న శివాలయం జెసి ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డిఐఇఒ రవికుమార్, డైట్ కాలేజ్ ప్రిన్సిపల్, డిఇఒ సుబ్రహ్మణ్యం, డిఎస్‌పి కృష్ణమోహన్, జి.ఎస్.డబ్ల్యూ లక్ష్మీపతి, రాయచోటి తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపిడిఒ సురేష్ బాబు, తదితర జిల్లా అధికారులు తదితరులతో కలిసి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని రాయచోటిలోని చిత్తూరు రోడ్డు వద్ద ఉన్న శివాలయం దగ్గర నుండి బంగ్లా సర్కిల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో చివరిగా బంగ్లా సర్కిల్ దగ్గర, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో మానవ హారంగా ఏర్పడి 100 మీటర్ల జాతీయ జెండాతో జాతీయ గీతాన్ని ఆలపించారు. ర్యాలీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు), జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, కల్పన ఒకేషనల్ జూనియర్ కళాశాల లక్ష్మీ శ్రీనివాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల, శ్రీ సందీప్ జూనియర్ కాలేజ్, పద్మావతి జూనియర్ కాలేజ్ (బాలికలు), సిఎస్ రాజు జూనియర్ కళాశాల శ్రీ సాయి జూనియర్ కళాశాల, చందనశ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్, డైట్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు, ఎఎన్ఎంలు, తదితర విద్యాసంస్థల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రజలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జూడోలో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 9, 10వ తేదీల్లో గుంటూరు జిల్లాలో నిర్వహించిన సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్‌లో రాజంపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి సత్తా చాటారని అన్నమయ్య జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.వెంకటేష్ తెలియజేశారు. 28 కిలోల విభాగంలో అస్మిత, 32 కిలోల విభాగంలోరెడ్డి రాణి రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఇరువురిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

మున్సిపల్ కమిషనర్‌గా రవి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి మునిసిపల్ కమిషనర్‌గా జి.రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాయచోటి కమిషనర్‌గా పని చేస్తున్న వాసు బాబు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో టిపిఆర్ఒగా బదిలీ కావడంతో ఎపి గ్రీనరి, బ్యూటిఫికేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ మున్సిపల్ కమిషనర్‌గా రాయచోటికి బదిలీపై వచ్చారు. ఈయన గతంలో తాడిపత్రి, మదనపల్లి, ఆముదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాయచోటి మున్సిపాలిటీని శానిటేషన్ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, స్వచ్ఛ రాయచోటి లక్ష్యమని పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ రవి

బెల్ట్ షాపులను అరికట్టండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మండలంలోని యనమలవారిపల్లెలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని సోమవారం సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి ఆ గ్రామ మహిళలు విన్నవించారు. అంతకు ముందు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీబీ మాట్లాడుతూ కొంతకాలంగా ఎనములవారిపల్లెలో భాస్కర్, రమాదేవి, నారాయణ తదితరులు విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నిత్యం గొడవలు జరుగుతున్నాయన్నారు. అరికట్టకపోతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలని నిరసన తెలుపుతున్న మహిళలు

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపి ఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో పీలేరులోని సంజయ్ గాంధీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీలేరులో మెగా జాబ్‌మేళా మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాలో యాక్సిస్ బ్యాంక్, ఐసిసిఐ బ్యాంక్, యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, టివిఎస్ లూకాస్, ఇల్ ఢీకన్,సన్ బిజ్ తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, ఉన యువతీ యువకులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://naipunyam.ap. gov.in/user-registration లింకును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966086996, 9553202509లలో సంప్రదించాలన్నారు.

వన్ టౌన్ సిఐగా మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఒకటో పట్టణ సిఐగా మహమ్మద్ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ ఎరిషావలి సస్పెండ్ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లా కొండాపురం సర్కిల్లో పనిచేస్తున్న మహమ్మద్ రఫీ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రత పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అధిక ప్రాధనతనిస్తూ ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ రఫీ

మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీలను ఇప్పటివరకు అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతిరోజు ప్రతిపక్షాలపై కక్ష సాధింపులు చేస్తున్నారు తప్ప ప్రజా పాలనపై దృష్టి సాధించడం లేదన్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే బరువు ప్రతిష్టలతో ఉన్న పెద్దిరెడ్డి కుటుంబంపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడం తీవ్ర అన్యాయమని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని, ప్రజలు కూడా మీ పాలన తీరును గమనిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో వారే బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం పలువురు నాయకులకు పార్టీ పదవులకు ఎన్నికైనట్లు నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ వైఫల్యాలను రూపంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, అగ మోహిద్దీన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, మండల అధ్యక్షుడు చింతల రమేష్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఎస్‌టిడి హరి, వేంపల్లి బాలాజీ, వెంకటపతి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చౌదరి నయీమ్

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

- డాక్టర్ చౌదరి నయీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ క్షయపై అవగాహన కలిగి ఉండడం వలన క్షయవ్యాధిని దూరం చేయవచ్చునని మండలంలోని నగిరిమడుగు డాక్టర్ చౌదరి నయీమ్ అన్నారు. సోమవారం మండలంలోని జగ్రావారిపల్లిలో నిర్వహించిన 104 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, గళ్ల పడడం, గళ్లలో రక్తం పడటం, సాయంత్ర వేళల్లో జ్వరం, ఆయాసం, నీరసం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా గుర్తించి సమీపంలోని ఆశవర్కర్, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి గళ్ల పరీక్ష చేయించుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు చికిత్స పూర్తిగా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. చికిత్స సమయంలో క్షయవ్యాధి గ్రస్తులకు రూ.వెయ్యి వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ రామాంజులు, సిహెచ్ఒ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందజేత

ప్రజాశక్తి - వీరబల్లి

వ్యవసాయ పంట నష్టపోయిన 10 మంది రైతులకు రూ.1,95,500 చెక్కును సోమవారం అందజేశారు. మండల పరిధిలోని సానిపాయి పంచాయతీలో తమ పొలాలను అడవి పందులు పంటను నాశనం చేశాయని పది మంది రైతుల ఫారెస్ట్ రైంజ్ ఆఫీసర్ వై.సి.రెడ్డికి మొరపెట్టుకున్నారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే అడవి జంతువులు పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అడవి జంతువుల భారీ నుంచి పంటలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాశనమైన ఆ పొలాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వైసిరెడ్డి పరిశీలించి వెంటనే స్పందించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేశారు. రైతులకు వచ్చిన నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో అందించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కులను చూపిస్తున్న దానిపై రైతులు

రాజకీయ పార్టీల అభిప్రాయాలు కీలకం : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో ఓటర్ల సవరణ- 2025, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారములు, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డిఆర్ఒ మధుసూదనరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విష యాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బిఎల్ఒలను నియమించి సంబంధిత నియామక పత్రాలను ఇఆర్ఒలకు సమర్పించాలని పేర్కొన్నారు. బిఎల్ఒలపై సమీక్షిస్తూ జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖలో బదిలీల కారణంగా చాలామంది మారారని, సంబంధిత వివరాలను రాజకీయ పార్టీలకు అందజేయాలని డిఆర్ఒకు సూచించారు. పోలింగ్ కేంద్రాలలో మార్పులు, చేర్పులపై సమీక్షించారు. మార్పులు, చేర్పులపనై ఎన్నికల కమిషన్‌కు తగు చర్యలు నిమిత్తం పంపుతామని తెలిపారు. కొత్తగా ఏమైనా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలి అనుకుంటే దానికి ఎన్నికల సంఘం వారు అవకాశం ఇస్తారని తెలిపారు. సమావేశంలో రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లు హెచ్.ఎస్ భావన, చల్ల కళ్యాణి, డిఆర్ఒ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ దుర్వినియోగం : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత వైసిపి ప్రభుత్వంలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను దుర్విని యోగం చేయడం వల్లే ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె. వెంకటేష్ ఆరోపించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో వేరుగా ఏర్పడిన కుటుంబాలను జాయింట్ కుటుంబాలుగా చూపడం ద్వారా ఏడాదిగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు పేదలు దూరమయ్యారని వెల్లడించారు. దీని వల్ల అర్హులైన లబ్ధిదారులు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అందుకోలేక పోయారని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో అర్హులైన వారిని చేర్పించి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి ఇప్పటికీ 9 నెలలు గడుస్తున్నా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, పార్లమెంట్ పార్టీ కార్యాలయం కార్యదర్శి పూల మురళి, ఒంటి కొండ వెంకటేష్, తెలుగు యువత కొనకుంట్ల శ్రావణ్ కుమార్, గట్టు చంద్రశేఖర్ నాయుడు, శివ శంకర్ పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టడమే బిజెపి లక్ష్యం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం 12 ఏళ్ల పాలన సాగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య తెలిపారు. అన్నమయ్య జిల్లా సిపిఐ 2వ మహాసభలు సందర్భంగా సోమవారం శేషసాయి కల్యాణ మండపంలో రెండవ రోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్‌ల ఆస్తులు పునఃపంపిణీ జరగాలని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు, వంటగ్యాస్, ఇంధన ధరలను నియంత్రించాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుల రామానాయుడు, శివారెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల కోసం మహిళల వినతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

టైలరింగ్ శిక్షణ పూర్తయి మూడు నెలలైనా టైలరింగ్ మిషన్లు అందించలేదని, శిక్షణ కేంద్రం నిర్వాహకులు నెలలు తరబడి కాలాయాపన చేస్తున్నారని శిక్షణ పొందిన మహిళలు సోమవారం నగర పంచాయతీ కమిషనర్ జి.వి.పల్లవికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై కమిషనర్ మాట్లాడుతూ ఎంపిడిఒ కృష్ణవేణికి విషయం తెలియజేసి కుట్టుమిషన్లు త్వరగా వచ్చేవిధంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు మున్సిపల్ కార్యాలయం నుండి వెనుదిరిగారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఆటోలకు గేట్ కట్టేందుకు జిఒ లేదని, అయినప్పటికీ ప్రతి ఆటోకు రూ.30 అధికంగా గుత్తేదారుడు డిమాండ్ చేస్తున్నారని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. చెల్లించకపోతే దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆటో డ్రైవర్లు, ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుడుము శరత్ సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కరించేందుకు వచ్చి ఆటోకు కనీసం రూ.10 చెల్లించాలని యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లకి కమిషనర్ కోరగా, జిఒ ఉంటే కచ్చితంగా చెల్లిస్తామని తెలిపారు. ఎటువంటి జిఒ లేకున్నా గుత్తేదారుడు గేటు చెల్లించలేదని కారణంగా దుర్భాషలాడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య గురించి ఆటో డ్రైవర్లు కమిషనర్‌తో మాట్లాడుతున్నప్పుడు ఆయన ఎదుటే గుత్తేదారుడు దుర్భాషలాడడం శోచనీయం. ఆటో డ్రైవర్లను దుర్భాషలాడితే సహించేది లేదని, గేట్ చెల్లించేది లేదని ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కుడుము శరత్, ఆటో డ్రైవర్స్ తేల్చి చెప్పేశారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అంబులెన్స్‌లోనే ఓ మహిళ ప్రసవించింది. తంబళ్లపల్లెకు చెందిన ఓ గర్భిణి ఆదివారం రాత్రి పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చింది. డాక్టర్ పరీక్షించి ప్రసవం కష్టం అంటూ మదనపల్లెకు రెఫర్ చేశారు. తంబళ్లపల్లె 108 సిబ్బంది ఆమెను మదనపల్లెకు తరలిస్తుండగా ఐదు నిమిషాల్లోనే దారిలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తంబళ్లపల్లె వైద్యులు నిర్ల్యంగా వ్యవహరించారని పలువురు వాపోయారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లె మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచా మృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి పూజారి శేఖర్ మల్లమ్మ అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

LOSS OF PASSPORT

I,GADDAM VISWANATH S/o GADDAM RAMANA, residing at Door No. 1-21, T.Sakirevupalli Village and Post, Valmikipuram Mandal, Annamayya District, A.P. I lost my Original Passport Bearing File No. N.8639386 on 06.08.2025 while travelling from T.Sakirevu palli to Valmikipuram by bus. If any one found please contact at 9136522895.

నులిపురుగులను నిర్మూలిద్దాం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వాల్మీకిపురం : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, వైద్య సిబ్బంది

రక్తహీనత నివారణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నమయ్య జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. సోమవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 12న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రామ్‌లో మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్, నర్సింగ్, జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం అనంతరం పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి వైద్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ, పురపాలక, పంచాయతీరాజ్, స్వచ్ఛంద సేవ సంస్థలు, జువైనల్ శాఖలతో ప్రతి ఒక్కరూ అమలు చేసి పిల్లలకు మాత్రలు వింగించాలని తెలిపారు. 12వ తేదీ మాత్రలు తీసుకొని వారు 20 తేదీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులలో రక్తహీనత నివారణ చేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక, శారీరక పెరుగుదల ఉంటుందని ముఖ్యంగా కిశోర బాలికలకు ఐరన్ అత్యంత అవసరమని తెలిపారు. రక్తహీనత రహిత సమాజ స్థాపనకు అందరం కలిసి పని చేయాలని కోరారు. జాతీయ నులిపురుగుల మాత్రలు, సంబంధిత కరపత్రాలు ఇప్పటికే అన్ని పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలకు పంపిణీ చేశామని, ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులిపురుగుల మాత్రలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ అధికారి డాక్టర్ శివప్రతాప్, ఎన్‌డిడి ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ ఇంతియాజ్, ఆర్‌బిఎస్‌కెడి ఇఒ వీర నరసింహులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎంపిడిఒ మనోహర రాజు అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కరపత్రాలను నగిరిమడుగు పిహెచ్‌సి డాక్టర్ రిచార్డ్ స్టీఫెన్, వైద్య సిబ్బందితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిచార్డ్ స్టీఫెన్ మాట్లాడుతూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, ఎంఇఒ వెంకటలక్ష్మీ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఐసిడిఎస్ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం :** 1-19 వయసు గల పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని హెల్త్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ ఎ.వి.ఎన్.ఎస్. అనిల్ కుమార్ పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినోద్ కుమార్ హెల్త్ సూపర్వైజర్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి :** నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ లోకవర్ధన్ పిలుపునిచ్చారు. స్థానిక మెయిన్ స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వలన పిల్లలకు వచ్చే వ్యాధుల గురించి అన్ని పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు వివరించి ప్రతి ఒక్కరికి ఆల్బెండజల్ టాబ్లెట్లు వేయించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్యగంధ, సూపర్వైజర్ సుధాకర్, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **సుండుపల్లి :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జయప్రదం చేయాలని ఎంఇఒ రవి నాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైద్య ఆరోగ్య కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు వంద శాతం అందజేయచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్యా అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఎరువులు నిల్..లిక్కర్ ఫుల్ : వైసిపి

టిడిపి మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కూటమి ఏడాది పాలన రైతులకు ఎరువులు నిల్, మందు బాబులకు లిక్కర్ ఫుల్ అన్న చందంగా సాగుతోందని మదనపల్లె నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నిసార్ అహ్మద్ ఆరోపించారు. సోమవారం మదనపల్లె మున్సిపాలిటీ 1, 2 వార్డులలో నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ మునూజ, కౌన్సిలర్లు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నాయకులు ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల దుస్థితి దయనీయంగా ఉందన్నారు. రైతులకు ఎరువులు ఇచ్చే దిక్కులేదు కానీ, గ్రామాల్లో మద్యం మాత్రం ఏరులై పారుతోందని విమర్శలు గుప్పించారు. ఎక్కడ చూసినా బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మదనపల్లె మున్సిపాలిటీలోని 1, 2, వార్డు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కూటమి పాలకులు వైఫల్యం చెందారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఏడాదిన్నర సమయం సరిపోలేదా అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయంగా అణగదొక్కడం తప్ప అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా లేదని దుయ్యబట్టారు. సిఎం చంద్రబాబు నాయుడు 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలిచ్చి, గద్దెనెక్కి ప్రజలను వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాదిన్నార కాలంలో అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని చెప్పారు. రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తే, మనం గుడ్ బుక్ ద్వారా జగన్మోహన్ రెడ్డి 2.0లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తారని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివా రెడ్డి, భాను, పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్ నాయక్, శారదారెడ్డి, నర్సింహులు, నూర్, మేరీ మునిశేఖర్, చిన్నా, పవన్, మధు, రేవతి, నాగమణి, యూనస్, సాదిక్, మిలటరీ మల్లికార్జున, మహేశ్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్

ఇండియా ఫైట్స్ హెచ్ఐవి అండ్ ఎస్‌టిఐ అనే థీమ్‌తో హెచ్ఐవి నిర్మూలనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను సోమవారం ఉదయం పిజిఆర్‌ఎస్ హాల్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు ఎంతో ఉపయోగపడతాయ న్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ లేదా ఇతర సుఖ వ్యాధులు పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేసుకునేలా ముందుకు వస్తారని తెలిపారు. బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షతను రూపుమాపేందుకు హెచ్ఐవి చట్టం 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆవిష్కరణలో జెసి ఆదర్శ రాజేంద్రన్, ఆర్‌డిఒ శ్రీనివాస్, డిఎంహెచ్ఒ లక్ష్మీ నరసయ్య, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'కలిసొచ్చే కాలానికి.. నడిసొచ్చే పిల్లలు' అనే అడాప్షన్ పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్, ఐసిడిఎస్ అధికారులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ చామకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 06 సంవత్సరాలు పైబడి 18 సంవత్సరాల లోపు పిల్లలను రెండు సంవత్సరాల పాటు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం పోస్టర్ అడాప్షన్ ద్వారా కలుగుతుందని తెలిపారు. పోస్టర్ కేర్ అనేది తల్లిదండ్రుల సంరక్షణ లేని పిల్లలకు తాత్కాలిక ఇల్లు, సంరక్షణ అందించే వ్యవస్థ వల్ల పోస్టర్ తల్లిదండ్రులు వారికి ప్రేమ, భద్రత, స్థిరత్వం అందిస్తారన్నారు. పిల్లలకు సురక్షితమైన, ప్రేమతో కూడిన వాతావరణం అందిస్తుందని చెప్పారు. వారి విద్య, ఆరోగ్యం, భావోద్వేగ అవసరాలను తీరుస్తుందిన్నారు.

దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

పిటిఎం రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని పెద్దతిప్పసముద్రం రోడ్డులోని షాదీమహల్ దగ్గర సమీపంలో ఆర్‌అండ్‌బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీనిపై ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో? అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం నియోజవర్గం వర్క్ ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్ప జెసిబితో నీరుని పక్కకు మళ్లించి తాత్కాలికంగా గుంతలు పడిన చోట రాళ్లతో గుంతల్లో కప్పి వేసి దానిపై మట్టితో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ ప్రస్తుతం వాహనదారులు ప్రజల, రాకపోకలు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేశామని పేర్కొన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో రోడ్డును మరమ్మతు చేస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకుందామని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బి కార్యాలయంలో టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరసనలు తెలిపితే సంఘాల నేతలపై అక్రమ కేసులు బనాయించేందుకు యత్నించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా ఉద్యోగుల సమస్యలపై స్పందించక పోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమాశంకర్, ప్రసాద్, డి ఈ శంకర్ నారాయణ, శ్రీధర్, ఎఇ చలపతి, ధర్మయ్య, శ్రీరాములు, రమణ, చిన్న, గోపాల్, శాంతమ్మ, లక్ష్మీబాయి, జానకమ్మ, రెడ్డమ్మ, మల్లికార్జున, నర్సింహులు, యుగంధర్, బాబు, కళ్యాణ్ కుమార్, పెన్షన్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-ములకలచెరువు

రైతులకు అండగా నిలబడి, వ్యవసాయానికి చేదోడుగా ఉండేందుకే రైతు భరోసా నిధులను ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించిందని, వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపేట వేస్తున్నట్లు తంబళ్లపల్లి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి దాసిరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం కూటమి ప్రభుత్వం రైతులకు విడుదల చేసిన రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా రైతుల సంబర సభను నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన రైతులతో కలసి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టిటిడి కళ్యాణ మండపం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన రైతు సంబర సభ కార్యక్రమంలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలకు చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, పారిశ్రామికవేత్త గిరిధర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, బిసి సెల్ ఉపాధ్యక్షులు తులసిధర్ నాయుడు, మాజీ సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, ఎర్రగుడి సురేష్, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కె.వి.రమణ, ఎఎంసి సెక్రటరీ నవీన్ కుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి స్రవంతి, సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

విద్యార్థునిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవోదయకు ఎంపికైన విజ్‌డమ్ విద్యార్థి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని విజ్‌డమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.భాను ప్రకాష్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంపికైనట్లు విజ్‌డమ్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ప్రణీత్ తేక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఇద్దరు విద్యార్థులను పాఠశాల ఛైర్మన్‌తో పాటు అక్కడ అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక, అకడమిన్ ఇన్‌ఛార్జి పి.ముఖేష్ అభినందించారు.

దేవపట్ల మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- కలకడ

సంబేపల్లె మండంలోని దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి సోమవారం మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి దేవపట్ల పంచాయతీలోని ఆవులవాండ్లపల్లెకు వెళ్లి నివాళులర్పించారు. దేవపట్ల గ్రామ అభివృద్ధికి వేణుగోపాల్‌రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని ఆయన ప్రశంసించారు. ఆయన కుమారులు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డిలను పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి శివయ్య, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ బుల్లి వెంకట రమణ, లక్కిరెడ్డిపల్లె ఎంపిటిసిలు జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీ పరిధి ఉన్న ఎగువ దళితవాడలో సోమవారం ఉదయం గ్రామానికి చెందిన రేనిమాని చిన్నప్ప (52) ఉదయం 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గ్రామంలోని బావిలో పడి మృతి చెందారు. ఐదు గంటలపాటు ఆయనపైకి రాకపోవడంతో గ్రామస్తులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఫైర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ శాఖ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బావిలో గాలింపు చర్యలను ప్రారంభించారు సుమారు 5 గంటలుగా గాలింపు చర్యలు కొనసాగుతున్నా, చిన్నప్ప ఆచూకీ ఇంకా లభించక పోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. జిల్లా అధికారులు స్పందించి గజ ఈతగాళ్లను రంగంలోకి దింపాలని, గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో చిన్నప్ప మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ మరో వ్యక్తి..

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి సోమవారం మృతి చెందారు. తాలూకా పోలీసుల కథనం మేరకు..మదనపల్లె మండలం, బి.ఎన్.రెడ్డి కాలనీలో నివాసముంటున్న అట్లూరి రాజన్న(65) గురువారం సాయంత్రం తిరుపతి జాతీయ రహదారి ఎరగానమిట్ట వద్ద ఆటో కోసం వేచియున్నారు. ఆ సమయంలో గుర్తుతెలియని ఇన్నోవా కారు ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన రాజన్నను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి, ఆ తరువాత తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్ : యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి బైక్‌తో ఢీకొట్టిన యువకుడు పోలిచెర్ల వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. సోమవారం రాజంపేట నుండి ద్విచక్ర వాహనంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ అధిక వేగంతో వచ్చి మోడల్ స్కూల్ సమీపం వద్ద నిలబడి ఉన్న లారీని వెనుక వైపు నుండి ఢీకొట్టాడు. వినయ్ తీవ్రంగా గాయపడి రోడ్డు మీద పడిపోయాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌ను పిలిపించి రాజంపేటకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

కుటుంబ సమస్యలతో డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. గాలివీడు మండల కేంద్రానికి చెందిన బాలయ్య కుమారుడు అనిల్(35) బి.కొత్తకోట మండలం బడికాయలపల్లికి చెందిన స్వరూపను 12 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి అరేళ్ల కుమారుడు జేమ్స్, నాలుగేళ్ల కుమార్తె లిప్సిక ఉన్నారు. వీరు రెండేళ్ల కిందట మదనపల్లె మండలం, నిమ్మనపల్లి రోడ్డు లోని బసినికొండకు వచ్చి నివాసం ఉంటున్నారు. అనిల్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు.. ఈ నేపథ్యంలో కుటుంబ ఖర్చులు పెరగడంతో స్వరూప తిరుపతిలోని ఓ ప్రయివేట్ రెస్టారెంట్‌లో పని చేసుకుంటూ అక్కడే ఉండేవారు. వీరి పిల్లలు బడికాయలపల్లిలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. ఈ నేపథ్యంలో అనిల్ తను ఆటో కొనుక్కోవాలని, రూ.30 వేలు డబ్బులు కావాలని తిరుపతిలో ఉన్న భార్య స్వరూపకు ఫోన్ చేశారు. ఇప్పట్లో అమౌంట్ కుదరదని చెప్పడంతోపాటు ఇద్దరు వాగ్వాదం చేసుకున్నారు. మనస్థాపానికి గురైన అనిల్ ఇంట్లో ఒంటరిగా ఉండడంతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రెండు రోజుల తర్వాత చుట్టుపక్కల దుర్వాసనవెదజల్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మృతుడి భార్య స్వరూపకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్ రోడ్డు లోయలో లారీ బోల్తా

ప్రజాశక్తి-రామపురం

కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ దారిలోని మండలం గువ్వల చెరువు ఘాటు రెండవ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిమెంట్ లారీ లోయలో పడి డ్రైవర్ ధనుంజయకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు చెందిన లారీ డ్రైవర్ ధనుంజయ ఎర్రగుంట్ల నుంచి బెంగళూరుకు సిమెంట్ తీసుకువెళ్తుండగా గువ్వల చెరువు రెండవ మలుపు వద్దకు రాగానే లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి లోయలో పడడంతో డ్రైవర్ ధనుంజయ తీవ్రగాయాలపాలయ్యాడు సంఘటన స్థలానికి స్థానికులు సహాయంతో డ్రైవర్‌ను బయటికి తీసి రక్షించారు. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గువ్వలచెరువు ఘాట్ రోడ్డు లోయలో పడిన సిమెంట్ లారీ